# సాక్షి కర్నూలు

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025






## ముంచెత్తిన వాన!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎడ తెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పంటలు నీటము నిగాయి. వాగులు, వంకలు పొంగి రాకపోకలు స్తంభించాయి.

IIలో▸



## శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: దసరా సెలవులు రావడంతో శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం శనివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. శ్రీమఠలో దర్శన క్యూలైన్లలో భక్తుల రద్దీగా కనిపించింది.



## బస్టాండ్ ఫుల్.. బస్సులు నిల్

సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు సొంతూర్లకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులు లేవు. దీంతో శనివారం కర్నూలు బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి కనిపించింది.

IIలో▸

## న్యూస్‌రీల్

### రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవచ్చన్నారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడానికి కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రజలు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

### పీజీ నాల్గవ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గత జూలైలో జరిగిన పీజీ నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసరావు ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. నాల్గవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 367 మంది హాజరు కాగా 360 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు 39 మంది హాజరుకాగా.. 30 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

### డీఐఓగా డాక్టర్ ఉమ



బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ ఉమ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ)గా డాక్టర్ పి.ఉమా శనివారం బాధ్యతలు చేపట్టారు. డీపీఎంఓగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి రావడంతో డీఐఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని వంద శాతం నిర్వహించి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచుతామని తెలిపారు.

### ఇక పొదుపు మహిళల లావాదేవీలు పారదర్శకం



వైపీ రమణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాల నిర్వహణ మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు సెర్ప్ మన డబ్బులు–మన లెక్కలు అనే వినూత్న కార్యాక్రమాన్ని చేపట్టిందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వైపి రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మహిళలు నెల వారీగా చేసుకునే పొదుపు.. సంఘాలు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలతో పాటు స్త్రీనిధి, ఉన్నతి తదితర కార్యక్రమాల కింద తీసుకున్న రుణాలు, చెల్లింపులను ఇక మీదట సెల్‌ఫోన్‌లోనే చూసుకోవచ్చన్నారు. ప్రయోగాత్మకంగా కర్నూలు మండలంలోని ఐదు గ్రామైఖ్య సంఘాలకు శిక్షణనిచ్చి యాప్ నిర్వహణపై అవగాహన కల్పించామన్నారు. కంతులు ఎప్పుడు చెల్లించాలి.. ఎంత చెల్లించాలనే విషయమై సెల్‌ఫోన్లకు వాయిస్ మెసేజ్ కూడా వస్తుందన్నారు. రెండవ విడతలో ఆలూరు, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి, నందవరం మండలాల్లో ఒక్కో గ్రామైక్య సంఘాన్ని ఎంపిక చేసి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడవ విడతలో జిల్లా మొత్తం యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు, పార్టీ కర్నూలు, నంద్యా జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ నేతలు

# వైఎస్ జగన్‌తోనే దళితులకు న్యాయం

**దళిత జాతికి శ్రీరామ రక్ష డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్**

- జగనన్న హయాంలో ఎస్సీలకు రూ.69 వేల కోట్ల లబ్ధి
- చంద్రబాబు హయాంలో 18 నెలల్లో రూ.13 వేల కోట్ల లబ్ధికి మంగళం
- దళిత వ్యతిరేకి గద్దె దిగేవరకు పోరాటం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు వెల్లడి

కర్నూలు(టౌన్): దళిత జాతికి రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా న్యాయం జరగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు నగరంలోని మౌర్య కళాశాల ప్రాంగణంలో ఎస్సీ సెల్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎల్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం ఏర్పాటైంది. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రాం, డాక్టర్ వైఎస్సార్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దళితులుగా ఎవరైనా పుడతారా అని బహిరంగంగా చెప్పడం దళిత జాతి ఎన్నటికీ మరిచిపోదని, ఆయన గద్దె దిగేవరకు పోరాటం చేద్దామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019–24 సంవత్సరంలో ప్రజల సంక్షేమానికి రూ.3.45 లక్షల కోట్లు ఖర్చు చేస్తే ఒక్క ఎస్సీల సంక్షేమానికే రూ. 69 వేల కోట్లు కేటాయించారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల వ్యవధిలో రాష్ట్రంలో ఎస్సీలు రూ.13 వేల కోట్లు ఆర్థికంగా నష్టపోయారన్నారు. అనంతరం నేతలు డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాయకల్ ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కాశపోగు ప్రభుదాస్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, మరకల వెంకటేష్, నగర అధ్యక్షులు కమతం పరశురాం, గద్దె రాజశేఖర్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, వైఎస్సార్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి హాజరైన దళితులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు ఊపిరి పోసింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. జగనన్న బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి, సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై కలసి కట్టుగా పోరాటం చేద్దామన్నారు.

కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ మాట ఇస్తే మడమ తిప్పని నాయకుడు జగనన్న అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించని విధంగా విజయవాడ నగర నడిబొడ్డున రూ.400 కోట్లు ఖర్చు చేసి 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని జగనన్న ఏర్పాటు చేశారన్నారు. అదీ జగనన్నకు దళితుల పట్ల చిత్తశుద్ధి అన్నారు.

ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కొమ్మూరి కనకరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీలకు ఆత్మగౌరవం పెరగాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మాన్షన్ హౌస్ ఉంటే అసెంబ్లీలో అధికార పార్టీ నేతలు ఎలా మాట్లాడుతారో ఈ ప్రపంచానికి తెలిసిపోయిందన్నారు. జగనన్న హయాంలో దళిత హోంమంత్రి, దళితులకు మంత్రి పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇచ్చారని గుర్తు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన ప్రభుత్వంలో కేవలం ఇద్దరు దళితులకు మంత్రి పదవులు కేటాయించి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు.

### ప్రభుత్వ ఆగడాలను తిప్పికొడదాం

ఇటీవల ఆదోనిలో దళిత సర్పంచ్‌ను స్టేజీ పైకి పిలవకుండా వారి కాళ్ల దగ్గర నిలబెట్టారంటే కూటమి పార్టీల నైజం అర్థమవుతోంది. ఉప ముఖ్యమంత్రి పదవి దళితులకు ఇవ్వడం ఇష్టం లేకనే పవన్‌కళ్యాణ్‌కు కట్టబెట్టారు. దళితులను టార్గెట్ చేసుకొని కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను సమర్థంగా తిప్పి కొట్టడంతో పాటు వారికి అండగా నిలిచేందుకు జగనన్న డిజిటల్ బుక్ క్యూర్ కోడ్ అందుబాటులోకి తీసుకొచ్చారు.

– ఎస్వీ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు

### జగనన్న హయాంలోనే న్యాయం

రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు జగనన్న హయాంలోనే సాధ్యమైంది. 50 శాతం రిజర్వేషన్లను 60 శాతానికి చేర్చి ఓసీలకు కేటాయించిన పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేసిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ఎస్సీ కులాలకు అన్యాయం జరిగితే పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కాటసాని రాంభూపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

కర్నూలు(సెంట్రల్): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అప్పుడే పర్యాటక అభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రూ.14 కోట్లతో ఐదు టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. వారసత్వంగా వచ్చిన పర్యాటక కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవాటు చేసుకోవాలన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ఆడ పిల్లలను కనీసం డిగ్రీ వరకు చదివించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా టూరిజం, డివిజినల్ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ యేడాది స్థిరమైన పర్యాటకం, పరివర్తన అనే మోటోను తీసుకొని పర్యాటక దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చిన్నారులు చారిత్రక వివరాలు తెలుపుతూ చేసిన నృత ప్రదర్శన, మోహన్‌బాబు చేసిన డాన్సింగ్ డాల్స్ ప్రదర్శనలు, గొరవయ్యల నృత్యాలు, కోలాటాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, ఆర్ఐఓ లాలెప్ప, డీఎస్ఓ రాజారఘువీర్, ఎస్‌డీసీలు నాగ ప్రసూన లక్ష్మీ, కొండయ్య పాల్గొన్నారు.

## న్యాయమూర్తులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి భానుమతి

కర్నూలు: 'నేరారోపణల రిమాండ్, జీవిత రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన చట్టం–జాగ్రత్త' అనే అంశంపై న్యాయమూర్తులకు అవగాహన సదస్సు జరిగింది. జిల్లా కోర్టు ఆవరణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది అధ్యక్షతన శనివారం జరిగిన అవగాహన సదస్సుకు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బీఎస్ భానుమతి, హైకోర్టు న్యాయమూర్తి ఎ.హరిహరనాథ శర్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయ శాఖకు సంబంధించిన పలు అంశాలపై న్యాయమూర్తులకు పలు సూచనలు చేశారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు లక్ష్మీరాజ్యం, శ్రీవిద్య, శోభారాణి, రాజేంద్రబాబు, హరినాథ్‌తో పాటు జిల్లాలోని న్యాయమూర్తులందరూ పాల్గొన్నారు.

# దేవరగట్టు ఉత్సవాలకు శ్రీకారం

- భక్తిశ్రద్ధలతో కంకణాధారణ
- అక్టోబర్ 2న 'బన్ని' జైత్రయాత్ర



కల్యాణ కట్టపై ఉత్సవ విగ్రహాలు



ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా దేవరగట్టుకు తీసుకెళ్తున్న ప్రజలు

హొళగుంద: దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. శ్రీమాళ మల్లేశ్వరస్వామికి శనివారం రాత్రి కంకణధారణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నెరణికి గ్రామంలో ఉత్సవమూర్తులను కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి పల్లకీతో పాటు విగ్రహాలను గ్రామ శివారు వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి గొరవయ్యలు, ఆలయ పూజారులతో దేవరగట్టుకు పంపారు. కొండకు చేరుకున్న విగ్రహాలను గిరిపై ఉన్న ఆలయంలోని కంకణకట్టపై కొలువుంచారు. సాయంత్రం ఆలయంలోని మూల విరాట్‌లకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. కంకణ కట్టపై కొలువుదీరిన మాత మాళమ్మ, మల్లేశ్వరునికి భక్తుల జయ ధ్వనుల మధ్య కంకణధారణ నిర్వహించారు. వచ్చే నెల 2న విజయదశమి రోజున స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించడానికి నిశ్చయించారు. అనంతరం జైత్రయాత్ర, మరుసటి రోజు 3న దైవవాణీ(కార్ణీకం), 4న రథోత్సవం, 5న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, కంకణ విసర్జన, 6న మాళమల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## అక్టోబర్ నుంచి సమ్మెలోకి వెళ్తాం

- కలెక్టరేట్ ఎదుట సచివాలయ ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించని పక్షంలో అక్టోబర్ నుంచి సమ్మెలోకి వెళ్తామని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు భాస్కరరెడ్డి, శివప్రసాద్, రవి యాదవ్, మగ్బుల్‌హుస్సేన్ హెచ్చరించారు. శనివారం గ్రామ, వార్డు సెక్రటరీల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించి కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ముగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను సర్వే పేరుతో క్షేత్ర స్థాయికి పంపి అవమానాలకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ చదువుకు విలువనిచ్చి రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సేవలను తమతో చేయించుకోవాలన్నారు. తమను తమ శాఖల మాతృసంస్థలకు అప్పగించాలని, సమయ పాలనతో పని ఒత్తిడి దూరం చేయాలని కోరారు. అన్ని విభాగాల తరహాలో తమకూ పదోన్నతులు కల్పించాలని, స్టేషన్ సినియారిటీ ఆధారంగా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

### జూనియర్ కాలేజీలకు 5 వరకు దసరా సెలవులు

కర్నూలు సిటీ: జూనియర్ కాలేజీలకు ఆదివారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి జి.లాలెప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు రోజుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించకూడదని, అక్టోబర్ 6వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు అక్టోబరు 10వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు.



# హంస వాహనంపై ఆదిదంపతులు



హంస వాహనంపై ఆదిదంపతులు, కాత్యాయని అలంకారంలో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైలంలో దసరా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం అలంకార మండపంలో హంస వాహనంపై స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుంచి ఆలయ అర్చకులు, పండితులు విశేష పూజలు చేశారు. శ్రీ భ్రమరాంబాదేవిని కాత్యాయని స్వరూపంలో అలంకరించారు. అమ్మవారు చతుర్భుజాలను కలిగి ఉండి..కుడివైపున అభయహస్తాన్ని, వరముద్రను, ఎడమవైపున పద్మాన్ని, ఖడ్గాన్ని ధరించి ఉన్నారు. కాత్యాయనీ దేవిని ఆరాధిస్తే భయాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. ఆలయం ఎదుట భాగంలో వేదికపై ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని అధిష్ఠింపజేసి విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. అనంతరం కాత్యాయనీ దేవిని, హంస వాహనంపై కొలువుదీరిన స్వామిఅమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, శ్రీచక్రార్చాన, నవావరణార్చన, విశేష కుంకుమార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### శ్రీశైలంలో నేడు

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం కాళరాత్రి అలంకారంలో భ్రమరాంబాదేవి, గజ వాహనంపై భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## క్లుప్తంగా

### సీఐఎస్ఎఫ్ జవాను మృతి


పరంధాముడు (ఫైల్)

డోన్ టౌన్: మండలంలోని చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాను బిచ్చపోగుల పరంధాముడు (34) శనివారం ఢిల్లీలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. అతని మృతికి సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉంది. తల్లిదండ్రులు రంగస్వామి, నాగలక్ష్మమ్మతో పాటు కుటుంబ సభ్యులు ఈ వార్తను తెలుసుకుని ఢిల్లీకి వెళ్లారు. ఆదివారం భౌతికకాయాన్ని గ్రామానికి తీసుకురానున్నట్లు సమాచారం. కాగా మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### ప్రత్యేక ఆఫర్ల లింకులతో తస్మాత్ జాగ్రత్త!

కర్నూలు: దసరా పండుగ దగ్గర్లో ఉన్నందున ప్రత్యేక ఆఫర్లు అంటూ సైబర్ నేరగాళ్లు రకరకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని, స్మార్ట్ ఫోన్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, వాట్సప్‌లలో ఆఫర్ల పేరుతో లింకులు పంపి మోసాలకు పాల్పడుతున్నట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో లింకుల ద్వారా వచ్చే యాప్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. అనాథరైజ్డ్ లోన్స్ అనే కొత్త రకమైన సైబర్ నేరాలు ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్ లైన్ నెంబర్, అలాగే www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### జీఎస్టీ రేట్లను సక్రమంగా అమలు చేయాలి


సదస్సులో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

కర్నూలు: వ్యాపారులు, డీలర్లు జీఎస్టీ రేట్లను సక్రమంగా అమలు చేసి వినియోగదారుల హక్కులు కాపాడాలని తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ పి.సుధాకర్ సూచించారు. కర్నూలులోని రిలయన్స్ స్మార్ట్ బజార్, జ్యోతి డిపార్ట్‌మెంట్ స్టోర్స్‌లో లీగల్ మెటరాలజీ ఆధ్వర్యంలో శనివారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జాయింట్ కంట్రోలర్‌తో పాటు డిప్యూటీ కంట్రోలర్ దయాకర్ రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు, డీఎస్ఓ రాజా రఘువీర్, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, జీఎస్టీ కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కైక తదితరులు హాజరై జీఎస్టీ రేట్ల తగ్గింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ 2 సంస్కరణల ప్రయోజనాలు, కొత్త పన్నుల రేట్ల తగ్గింపు, వాటి ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ కొనుగోలుదారులకు అవగాహన కల్పించారు.

### ఉల్లి పంట.. జీవాలకు మేత!

ఓర్వకల్లు: రైతు కష్టపడి పండించిన ఉల్లి పంటను జీవాలకు మేతగా వదిలేసిన ఘటన మండలంలోని కన్నమడకల గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. అధిక వర్షాలు, గిట్టుబాటు ధరలేక ఈ ఏడాది ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ క్రమంలో కన్నమడకల గ్రామానికి చెందిన యువ రైతు వడ్డె మక్కలి శ్రీనివాసులు తనకున్న 1.50 ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు. దాదాపు రూ.70–80 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. పంట బాగానే వచ్చినప్పటికీ కోత సమయంలో అధిక వర్షాలకు గడ్డలు నేలలోనే కుళ్లిపోవడం, మార్కెట్‌లో గిట్టుబాటు ధరల్లేకపోవడంతో ఏం చేయాలో తోచక పంటను జీవాలకు వదిలేసినట్లు బాధిత రైతు శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చాలా మంది రైతులు ఉల్లి పంటను వదులుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.


ఉల్లి పొలంలో మేస్తున్న జీవాలు


నంద్యాల సమీపంలో ఉప్పొంగిన కుందూ


గోనెగండ్ల: వర్షపు నీటిలో మునిగిన పత్తి పంట


ఆదోని: వరద నీటిలో పర్యటిస్తున్న కమిషనర్ కృష్ణ

# ముంచెత్తిన వాన!

- భారీగా దెబ్బతిన్న పత్తి, ఉల్లి, కంది, టమాట
- పొంగిన వాగులు, వంకలు.. స్తంభించిన రాకపోకలు
- పెరిగిన చలి తీవ్రత.. 30 గొర్రెలు మృతి

ఆకాశానికి చిల్లుపడినట్లు ఒకటే వాన. రోడ్లన్నీ జలమయం అయ్యి చెరువులను తలపించాయి. చాలా చోట్ల రాకపోకలు స్తంభించిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధం అయ్యాయి. మేఘాలు ముసురు పట్టి చలి తీవ్రత విపరీతంగా పెరిగి వివిధ రోగాలు ప్రబలుతున్నాయి. ఎడతెరపని వర్షంతో అనేక కష్టాలు ప్రజలను గజగజ వణికిస్తున్నాయి.


నంద్యాలలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పాలేరువాగు


ఆదోనిలో పొంగి ప్రవహిస్తున్న రాంజల చెరువు

కర్నూలు(అగ్రికల్చర్)/ నంద్యాల(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారు జాము 3 గంటల నుంచి శనివారం అర్ధరాత్రి వరకు తెరిపి లేకుండా వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో రికార్డు స్థాయిలో ఒకే రోజు 62 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 16 మండలాల్లో 50 మి.మీ. కంటే ఎక్కువ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రాకపోకలు పూర్తిగా స్తంభించి పోయాయి. గాజులదిన్నె ప్రాజెక్టుకు భారీగా నీరు రావడంతో రెండు గేట్లు ఎత్తి హంద్రీ నదిలోకి విడుదల చేశారు. దేవనకొండ మండలంలో చెరువులు నిండి పొంగిపొర్లుతున్నాయి. అధిక వర్షాలతో పత్తి, ఉల్లి, మొక్కజొన్న, కంది, టమాట, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. పంటలు నీట మునిగి పనికిరాకుండా పోయాయి. ఆగష్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ. ఉండగా 208.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా 27 రోజుల్లోనే 199.8 మి.మీ. నమోదైంది. కుండపోత వానకు ఈదురు గాలులు తోడు కావడంతో చలి తీవ్రత పెరిగి ఎమ్మిగనూరు మండలం సోగనూరు గ్రామంలో 30 గొర్రెలు మృతి చెందాయి.

**నంద్యాల జిల్లాలో..**

కుందూ, మద్దిలేరు, పాలేరువాగులు ఉప్పొంగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ హెచ్చరికలు చేశారు. పంట పొలాల్లో నీట మునగడంతో రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. నంద్యాలలో నందమూరినగర్ వైపు వెళ్లే కుందూ బ్రిడ్జి, రామకృష్ణ పీజీ కళాశాల సమీపంలోని పాలేరు వాగు వద్ద పోలీసులు మోహరించి ప్రజలను అప్రమత్తం చేశారు. శ్రీశైలం, నందికొట్కూరు, నంద్యాల నియోజకవర్గాల్లో గురువారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరపి లేని వర్షం కురియడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

**రైతుకు క'న్నీరే' మిగిలింది!**

ఈ ఏడాది జిల్లాలో 2.20 లక్షల హెక్టార్లలో పత్తి సాగు కాగా.. అధిక వర్షాలతో పగిలిన పత్తికాయలు నేల రాలి పోయాయి. సాధారణంగా ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఇప్పుడు 3 క్వింటాళ్లు కూడా రాని దుస్థితి ఏర్పడింది. పత్తికి వాతావరణ బీమా ఉన్నా ఎకరాకు రూ.2000 ప్రీమియాన్ని రెండు శాతం మంది రైతులు కూడా చెల్లించలేదు. అధిక వర్షాలతో ఉల్లి సాగు చేసిన రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. ఈ క్రాప్ నమోదు ప్రకారం జిల్లాలో 52 వేల ఎకరాల్లో ఈ పంట సాగు కాగా నిరంతరం వర్షాలు పడుతుండటంతో దిగుబడి స్వల్పంగా వచ్చింది. అధిక వర్షాలతో టమాట, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతింటున్నాయి. పెట్టుబడి నీళ్ల పాలై రైతుకు క'న్నీరే' మిగిలింది.

**రానున్న రోజుల్లో కూడా భారీ వర్షాలు**

రానున్న రోజుల్లో బంగాళాఖాతంలో అల్ప పీడనాలు ఏర్పడనున్నాయని, భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే అధిక వర్షాలతో ఉక్కిరిబిక్కిరవుతున్న రైతులు రానున్న రోజుల్లో కూడా భారీ వర్షాలు పడుతాయనే సమాచారంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు.

**2,085 హెక్టార్లలో మాత్రమే పంట నష్టం!**

కర్నూలు (అగ్రికల్చర్): అతి భారీ వర్షాలతో జిల్లాలో 2,085 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కర్నూలు, కల్లూరు, ఆస్పరి, ఆదోని, దేవనకొండ మండలాల్లోని గ్రామాల్లో పత్తి, వరి, మొక్కజొన్న, కంది, వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపారు. పంటలకు అపారమైన నష్టం జరిగినా వ్యవసాయ శాఖ మాత్రం తూతూమంత్రంగా అంచనా వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఉమ్మడి జిల్లాలో వర్షపాతం వివరాలు**

| మండలం | నమోదైన వర్షపాతం (మి.మీ.) |
|---|---|
| దేవనకొండ | 142.6 |
| ఆదోని | 126.2 |
| మంత్రాలయం | 99.4 |
| ఎమ్మిగనూరు | 88 |
| మహానంది | 87.2 |
| నందవరం | 85.6 |
| గోనెగండ్ల | 83.6 |
| వెలుగోడు | 77.6 |
| పెద్దకడుబూరు | 76.4 |
| నంద్యాల | 74.2 |
| ఆత్మకూరు | 73.4 |
| కౌతాళం | 66.2 |
| వెల్దుర్తి | 65.6 |
| బండిఆత్మకూరు | 63.2 |
| ఆస్పరి | 62.2 |
| బేతంచెర్ల | 60.4 |
| గూడూరు | 59.6 |
| సి.బెళగల్ | 58.8 |
| కోడుమూరు | 58.2 |
| బనగానపల్లె | 58.0 |
| కల్లూరు | 53.6 |

**పోటెత్తిన హంద్రీ**


కోడుమూరు వద్ద పరవళ్లు తొక్కుతున్న హంద్రీ

గోనెగండ్ల/కోడుమూరు రూరల్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తోడు గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) నుంచి వస్తున్న నీటితో హంద్రీనది పోటెత్తింది. కోడుమూరు వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జీడీపీ రెండు గేట్లను ఎత్తి శనివారం ఉదయం 15,000 క్యూసెక్కుల నీటిని హంద్రీ నదికి వదిలారు.


జాతీయ రహదారిపై పారుతున్న సిద్ధాపురం అలుగు నీరు

**కేజీ రోడ్డుపై రాకపోకలు బంద్**

ఆత్మకూరురూరల్: సిద్ధాపురం చెరువు కుడివైపు అలుగు పొర్లుతూ కర్నూలు–గుంటూరు రోడ్డు (కేజీ రోడ్డు)పైకి వచ్చాయి. ఇది 340సి జాతీయ రహదారి కావడంతో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. పోలీసులు అక్కడ కాపలాగా ఉండి వాహనాలు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. విజయవాడ, శ్రీశైలం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను ఆత్మకూరు బస్టాండ్‌లోనే నిలిపి వేశారు. చెరువు నిండిందన్న సమాచారం రావడంతో మత్స్యకారులు అలుగుకు అడ్డుగా వలలు కట్టి చేపలు దాటి పోకుండా కాపాడుకునే యత్నం చేశారు. ఇదిలా ఉండగా బవనాశి నదిలో నీటి ప్రవాహం పెరిగి ఆత్మకూరు సమీపంలో రోడ్డుపైకెక్కి పారుతుండడంతో కురుకుంద గ్రామానికి రాకపోకలు నిలిచి పోయాయి. అలాగే వడ్లరామాపురం వెళ్లే దారిలో కూడా భవనాశినది బ్రిడ్జిలపై వరద నీరు పారుతుండడంతో ఆ గ్రామానికి కూడా ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి.


మంత్రాలయం మండలం మాలపల్లి వంక ఉప్పొంగడంతో ఇరువైపులా నిలిచిన జనం

## కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో అధిక వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశించారు. ప్రతి మండల కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలకు వర్షాలతో ఏమైనా ఇబ్బందులు కలిగితే 08518–277305 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలను, పాత బ్రిడ్జిలను పరిశీలించాలన్నారు. అవసరమైన చోట ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉన్న చోట మోటార్లతో తొలగించాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖను ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు.

## న్యాయవాదుల దీక్షకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు


న్యాయవాదుల దీక్షలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని న్యాయవాదులు చేపట్టిన దీక్షకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. హైకోర్టు సాధన కమిటీ సభ్యులు వి.కృష్ణమూర్తి, కె.నాగరాజు, నరసింహులు, జి.రామాంజనేయులు, సింగరాజు లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలకు శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడితోపాటు మేయర్, కోడుమూరు ఇన్‌చార్జి ఆదిమూలపు సతీష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమకు మేలు చేసేలా కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించారన్నారు. అందులో భాగంగా కర్నూలులో జాతీయ న్యాయ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారని, లోకాయుక్తా, హెచ్‌ఆర్‌సీ, వక్ఫ్‌ట్రిబ్యునల్, ఏపీఈఆర్‌సీ, సీబీఐ కోర్టు తదితర కోర్టులను ఏర్పాటు చేశారన్నారు. హైకోర్టును ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నా కోర్టుల అడ్డగింతతో సాధ్యం కాలేదన్నారు. 2029లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి హైకోర్టును ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. దీక్షలో కూర్చున్న బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ సుబ్బయ్య, చంద్రుడు, రాజేంద్ర ప్రసాదు, మహేష్, సోమశంకర యాదవ్, ఆనంద్‌కు పూల దండలు వేసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు సువర్ణా రెడ్డి, సత్రాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై ఫ్యాప్టో పోరుబాట

- ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆందోళనలు ఉధృతం చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు తెలిపారు. శనివారం ఆ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 7వ తేదీన రాష్ట్ర స్థాయిలో విజయవాడలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తున్నామన్నారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఉద్యోగులకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలపై ఏ మాత్రం స్పందించడం లేదన్నారు. ఇంత వరకు ఒక్క డీఏ కూడా ఇవ్వలేదని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తొలగిస్తామని చెప్పి, అదనంగా పని భారం మోపడం ఎంత వరకు సమంజసమన్నారు. 12వ పీఆర్‌సీకి తక్షణమే కమిషనర్‌ను నియమించి, ఆ నివేదికను సమర్పించేలోగా, మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలన్నారు. 2025 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు ఏ జిల్లాకు చెందిన వారికి ఆ జిల్లాలోనే శిక్షణ ఇవ్వాలని, మ్యానువల్‌గానే వారికి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మారియానందం, గౌరవ అధ్యక్షులు కమలాకర్ రావు, సహాధ్యక్షులు స్వామినాథన్, జిల్లా అదనపు కార్యదర్శి పీవీ శేషయ్య, జిల్లా ఉపాధ్యక్షులు యోగేంద్ర బాబు, జిల్లా కార్యదర్శి రామ్‌గోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బస్సుల కోసం వేచి ఉన్న విద్యార్థులు, ప్రజలు


సీట్ల కోసం ప్రయాణికుల పాట్లు


పల్లెకు వెళ్లేందుకు బస్సెకెత్తున్న దృశ్యం

## బస్టాండ్ ఫుల్.. బస్సులు నిల్

దసరా పండుగ సమీపిస్తోంది. దూర ప్రాంతాల్లో ఉన్నోళ్లు సొంతూర్లకు చేరుకుంటున్నారు. ప్రయాణికులతో కర్నూలు బస్టాండ్ కిటకిటలాడుతోంది. అయితే పల్లెలకు వెళ్లేందుకు మాత్రం బస్సుల్లేవు. మరో వైపు కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు ఊర్లకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకోవడంతో కిక్కిరిసిపోయింది. రోజువారి ప్రయాణికులతో పాటు వేలాదిగా విద్యార్థులు బస్టాండ్‌కు రావడంతో నిలబడేందుకు సైతం స్థలం లేని పరిస్థితి నెలకొంది. రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో గంటల కొద్ది నిరీక్షించాల్సి వచ్చింది. రహదారులు ఛిద్రమై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోజుకు 10 నుంచి 15 బస్సులు గ్యారేజీకు చేరుతున్నాయి. అక్కడ సిబ్బంది కొరతతో మరమ్మతులు చేయలేక డిపోకే పరిమితమవుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అరకొర బస్సుల్లోనే అతి కష్టం మీద కొందరు ఊర్లకు వెళ్లారు. రద్దీ ఎక్కువగా ఉండడంతో బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దాదాపు అన్ని బస్సుల్లో స్టాండింగ్, ఫుట్‌బోర్డులపైనే ప్రయాణికులు వెళ్లారు. బస్సుల కొరతపై జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసులును వివరణ కోరగా.. కాలేజీలకు దసరా సెలవులు ఇవ్వడంతో బస్టాండ్‌లో రద్దీ ఊహించని విధంగా పెరిగింది. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను సైతం తిప్పి, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. – కర్నూలు సిటీ